క్లుప్తంగా

వైభవంగా ఆలయాల ప్రతిష్ఠ



కన్నెవీడు(వత్సవాయి) : గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ, ముత్యాలమ్మ, అంకమ్మ, ఆంజనేయస్వామి ఆలయాల ప్రతిష్ఠా కార్యక్రమాలు శనివారం వైభవంగా సాగాయి. వేదపండితుడు దివి రామకృష్ణామాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలకు తరలివచ్చిన బంధుమిత్రులతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఎస్‌ఐ బి.అభిమన్యు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ చావా దుర్గారాణి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు.

ఖోఖో జిల్లా జట్టుకు ఎంపిక



వత్సవాయి : తమ విద్యార్థి సీహెచ్ గాయత్రి జిల్లా ఖోఖో జట్టుకు ఎంపికైనట్లు వత్సవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న గాయత్రిని శనివారం హెచ్‌ఎం అశోక్‌కుమార్, పీడీ మార్కపూడి బాబురావు, ఉపాధ్యాయుడు కాకాని శ్రీను, విద్యార్థులు అభినందించారు.

పాస్టర్లు సమాజహితం కోసం పనిచేయాలి

కంచికచర్ల : పాస్టర్లు సమైక్యంగా ఉండటంతో పాటు సమాజహితం కోసం పనిచేయాలని పాస్టర్ల సంఘ నాయకుడు బంకా నెహేమ్యా సూచించారు. కంచికచర్ల వసంతకాలనీలో హెబ్రోన్ చర్చిలో పాస్టర్ హిజ్కియారాజు అధ్యక్షతన కంచికచర్ల, వీరులపాడు మండలాల మండల సమైక్య సేవకుల సదస్సు శనివారం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్యంగా ఉండటం ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెండు మండలాల పాస్టర్ల సంఘ నాయకులు బీఎస్ పాల్, మోషే, శ్యాంపాల్, విల్సన్, సీయోన్‌కుమార్, స్వామిదాసు, శ్యామ్యేలు, ఇమ్మానియేలు, రాజు, సుధీర్, విజయ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలపై హర్షం



నందిగామ: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్లు సేవే పరమావధిగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో పింఛన్ లబ్ధిదారులు ఎక్కడ ఉన్నా కూడా అక్కడకు సొంతఖర్చులతో వెళ్లి పింఛన్ అందజేస్తున్నారు. పట్టణంలోని 18వ వార్డుకు చెందిన సంపసాల వెంకటస్వామికి విజయవాడలోని ఓ వైద్యశాలలో ఆపరేషన్ జరిగింది. అనంతరం అక్కడే చికిత్సపొందుతున్న వెంకటస్వామి వద్దకు శనివారం వలంటీర్ చావల భద్రకాళి వెళ్లి పింఛన్ నగదు అందజేసింది. పింఛన్ నగదు అందజేయడంపై లబ్ధిదారుల కుటుంబసభ్యులు హర్షం వ్యక్తంచేస్తూ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

చెప్పుల దుకాణం దగ్ధం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని విలియంపేటకు చిరువ్యాపారి గాదె హనుమంతరావు స్థానిక రైల్వే బ్రిడ్జి ప్రక్కన చిన్న బడ్డీ కొట్టు ఏర్పాటు చేసుకొని చెప్పుల వ్యాపారం చేసుకుంటుండగా, శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దుకాణానికి నిప్పంటించడంతో దగ్ధమైంది. విషయాన్ని బాధితుడు వెంటనే మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్‌కు తెలుపగా ఆయన వెంటనే స్పందించి అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో రూ.30వేల విలువగల సరుకుతోపాటు రూ.7వేల నగదు దగ్ధమైందని బాధితుడు వాపోయాడు. ఘటనాస్థలాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్ సందర్శించి, బాధితుడిని పరామర్శించారు.ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సహకారంతో ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రభాకర్ వెంట విలియంపేటకు చెందిన నాయకులు రాంబాబు, వినోద్, నాగేంద్రం, వలంటీర్ నాగమణి పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



చందర్లపాడులో ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు కొనియాడారు. మండలంలోని అల్లూరు, వీరులపాడు, చౌటపల్లి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల ప్రజలతో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రతి గడపకు వెళ్లా.. ప్రతి ఒక్కరిని పలుకరించా.. ప్రతిఒక్కరి సమస్య తెలుసుకున్నానని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కింద ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.20లక్షలు మంజూరు చేసిందని, ఆ నిధులతో ఆయా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నానని వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని గుర్తు చేశారు. కులమతాలు, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కొనియాడారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, ఏఎంసీ చైర్మన్ కోటేరు మల్లేశ్వరి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్‌లు బందెల రాణి, పల్లెపోగు పుల్లయ్య, చలమల దుర్గారావు, కన్నమాల సురేష్, మాజీ సర్పంచ్ కోటేరు సూర్యనారాయణరెడ్డి, ఉప సర్పంచ్ బెల్లంకొండ నాగేశ్వరరావు, ఎంపీడీవో అరుంధతీదేవి పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంకు ప్రారంభం

చందర్లపాడు(నందిగామ): ప్రజలకు అవసరమైన అన్నిరకాల మౌలికవసతులు కల్పించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. చందర్లపాడులో రూ.72లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంక్ ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల హయాంలో ఎన్నో గ్రామాలు కనీసమౌలిక వసతులకు కూడా నోచుకోలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలికవసతులు సమకూరుతున్నాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో చందర్లపాడు జడ్పీటిసి సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, పార్టీ నాయకులు యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్, జానకి రామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో తీరనున్న మంచినీటి కష్టాలు

- జలజీవన్ నిధులు రూ.3.18కోట్లు మంజూరు
- మరో రూ.కోటితో పైపులైన్ పనులు
- గ్రామానికి చేరిన మెటీరియల్
- త్వరలో పనులు ప్రారంభం



పైపులైన్ నిర్మాణం కోసం తెప్పించిన మెటీరియల్

పెనుగంచిప్రోలు: ప్రజల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పెనుగంచిప్రోలు గ్రామ పంచాయతీ ప్రజల మంచినీటి కష్టాలు తీర్చేందుకు అడుగులుపడుతున్నాయి. జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.3.18 కోట్లతో మంచినీటి పైపులైన్, ఇంటింటికి కుళాయి, ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. అదేవిధంగా మరో రూ.కోటి నిధులతో తూర్పు బజారు, పడమట బజారు ఎస్సీకాలనీలో పైపులైన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులకు సంబంధించి అవసరమైన కొత్త పైపులు, ఇతర మెటీరియల్ ఇప్పటికే గ్రామానికి చేరుకుంది. ఈ పనులు త్వరితగతిన పూర్తిచేసి పెనుగంచిప్రోలులో ప్రతి ఇంటికి రక్షిత మంచినీటిని అందిస్తామని అధికారులు చెబుతున్నారు. గ్రామంలో 16వార్డులు ఉండగా 5వేల ఇళ్లు ఉన్నాయి. అయితే కేవలం 1800 కుళాయిలు మాత్రమే ఉన్నాయి. దీనికితోడు గత ప్రభుత్వ హయాంలో వేసిన పైపులైన్ పనిచేయక పోవడంతోపాటు పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా కుళాయిల ఏర్పాటు చేసేందుకు గ్రామసర్పంచ్ వేల్పుల పద్మకుమారి స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి సమస్య పరిష్కారం కోసం జలజీవన్ మిషన్ నిధులు రూ.3.18కోట్లు మంజూరు చేయించారు. మంచినీటి కష్టాలు తీరనుండటంతో పంచాయతీ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో పనులు ప్రారంభం..



జనాభా, గృహాల సంఖ్య పెరగడంతో మంచినీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాము పాలనలోకి వచ్చిన తరువాత మంచినీటి సమస్యపై ప్రధానంగా దృష్టి పెట్టాం. స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో వెంటనే జలజీవన్ మిషన్ నిధులు మంజూరు చేయించారు. కొద్దిరోజుల్లో పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేస్తాం. పెనుగంచిప్రోలులో ఇంటింటికీ కొళాయి సదుపాయం కల్పిస్తాం.

వేల్పుల పద్మకుమారి, సర్పంచ్

లోక్‌అదాలత్‌తో సమయం, డబ్బు ఆదా

15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ



సమావేశంలో మాట్లాడుతున్న 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ

నూజివీడు: పట్టణంలోని కోర్టు భవనాల ప్రాంగణంలో వచ్చే నెల 9న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఏ నాగశైలజ పేర్కొన్నారు. స్థానిక 15వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో శనివారం పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. సివిల్ కేసులు, పరిష్కరింపదగిన క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మనోవర్తి కేసులు, వాహన ప్రమాద నష్టపరిహార తదితర కేసులు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. రాజీమార్గంలో పరిష్కరించే ఈ కేసులపై అప్పీలుకు వెళ్లే అవకాశం కూడా ఉండదన్నారు. ఈ పరిస్థితుల్లో కక్షిదారులు ఆవేశంలో చేసిన తప్పిదాలను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు మంచి అవకాశమన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కే హరిబాబు, స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, ఏపీపీలు ఎస్‌ఏ ఖాన్, కిషోర్, డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్, పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్లస్థలాల ప్రకటన చరిత్రాత్మకం

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జర్నలిస్టు కుటుంబాలకు ఇళ్లస్థలాలు మంజూరు చేస్తూ మంత్రివర్గ సమావేశంలో ఆమోదించడం హర్షనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న జర్నలిస్టుల సేవలను గత ప్రభుత్వాలు గుర్తించకపోవడం శోచనీయమన్నారు. సొంత ఇల్లు, స్థలాలు లేక ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, వారి చిరకాల వాంఛను నెరవేర్చబోతున్నందుకు జర్నలిస్టులంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. మరొకసారి తన సంక్షేమ మార్కును జర్నలిస్టుల విషయంలో కూడా చూపించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రేషన్ డీలర్ల ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నందిగామ: డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్టులకు అర్హత కలిగినవారు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆర్డీవో పి.సాయిబాబు శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 28షాపులకు రేషన్ డీలర్లను నియమించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిందన్నారు. ఇంటర్ చదివి ఉండి, 18ఏళ్లు పైబడి 40ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాతపరీక్ష ద్వారా అర్హులైన అభ్యర్థులను ఎంపికచేస్తారని వివరించారు. ఇతర వివరాలకు నందిగామ ఆర్డీవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సమన్వయంతో సేవలు అందించాలి



ప్రశాంతిని సత్కరిస్తున్న ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీ, ఏఆర్‌టీ సిబ్బంది

చిట్టినగర్(విజయవాడవెస్ట్): ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి సూచించారు. జక్కంపూడి కాలనీలోని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో శనివారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో భాగంగా జిల్లాలోని ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీ, ఏఆర్‌టీ సెంటర్ ఉద్యోగుల పనితీరును ఉషారాణి సమీక్షించారు. ప్రతి ఒక్కరూ నిర్దేశించిన లక్ష్యాలు చేరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ కిరణ్‌పందిటి మాట్లాడుతూ హెచ్‌ఐవీ కేసులను ఆరంభ దశలోనే గుర్తించి ఏఆర్‌టీ చికిత్స ఇప్పించాలని సూచించారు. అనంతరం విభాగాల వారీగా సమీక్ష నిర్వహించారు.

ఐసీటీసీ సూపర్‌వైజర్‌కు సత్కారం

ఉద్యోగోన్నతిపై బదిలీపై వెళ్తున్న జిల్లా ఐసీటీసీ సూపర్‌వైజర్ జె. ప్రశాంతి చౌదరిని జిల్లా ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీ, ఏఆర్‌టీ సిబ్బంది ఘనంగా సత్కరించారు. 14 సంవత్సరాలుగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఆమె అందించిన సేవలను కొనియాడారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగంలో పనిచేసి వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లిన దేవదానంను సత్కరించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

మైలవరం: మద్యం సీసాలు గరిష్ట చిల్లర ధరకు మించి ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు ఎక్సైజ్ విజిలెన్స్ సీఐ జే శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు ఎక్సైజ్ విజిలెన్స్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు గత రాత్రి మైలవరం పట్టణంలోని పలు మద్యం షాపులలో తనిఖీలు నిర్వహించారు. మైలవరం పోస్టాఫీస్ రోడ్డులోని మద్యం షాపులో పని చేసే సేల్స్‌మ్యాన్ బాణావత్ చంటిబాబు గరిష్ట ధర కంటే రూ.5కు అధికంగా అమ్ముతుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారెడ్డి, కానిస్టేబుల్ మోహన్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ముసునూరు: యువతి అదృశ్యంపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై ఎం.కుటుంబరావు కథనం మేరకు చెక్కపల్లికి చెందిన పల్లి రాంబాబు కుమార్తె ప్రియాంక ఈ నెల రెండో తేదీ కనిపించడం లేదు. ఇంట్లో ఉన్న రూ.50 వేల నగదు, ఒక మొబైల్ ఫోన్ తనతోపాటు తీసుకు వెళ్లింది. బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తండ్రి రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలపారు.

కళావేదిక ప్రారంభం



కళావేదిక ప్రారంభిస్తున్న దాతలు



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు కాజ్‌వే పక్కన వేంచేసియున్న శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి ఆలయంలో భక్తుల విరాళాలు రూ.10లక్షలతో నిర్మించిన కళావేదికను శనివారం ప్రారంభించారు. అనంతరం పరాంకుశం రంగాచార్యులు ఆధ్వర్యంలో బాలకృష్ణమాచార్యులుచే వాస్తుపూజ, స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం 41రోజుల పాటు శ్రీఅయ్యప్ప దీక్షాస్వాములకు అందించే సద్ది(భోజనం)కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త కొమరగిరి రఘురామారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు కాకాని శ్రీనివాసరావు, గజ్జి కృష్ణమూర్తి, ఆలయ మాజీ చైర్మన్ కర్ల వెంకటనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, శ్రీఅయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు వాసిరెడ్డి బెనర్జీ, సద్ది కార్యక్రమ నిర్వాహకులు రేగండ్ల రవికుమార్ పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న ఎంపీడీవోకు సత్కారం



పదోన్నతిపై వెళ్తున్న ఎస్‌వీ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ గాంధీ, అధికారులు, సిబ్బంది



రమేష్‌బాబును సన్మానిస్తున్న ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ దేవమణి, కె.వెంకటేశ్వర్లు, సిబ్బంది

పెనుగంచిప్రోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పనిచేస్తూ పదోన్నతిపై డివిజనల్ రూరల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీఎల్‌డీవో)గా వెళ్తున్న ఎస్‌వీ ప్రసాద్‌ను స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్కపూడి గాంధీ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో బాధ్యతలను ఏఈ కె.సిద్ధారెడ్డికి అప్పగించారు. సిద్ధారెడ్డిని కూడా కార్యాలయ సిబ్బంది సత్కరించారు.

వత్సవాయి ఇన్‌చార్జి ఎంపీడీవోగా రమేష్‌బాబు

వత్సవాయి : ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న ఎస్వీ ప్రసాద్ పదోన్నతిపై బదిలీకాగా, ఆ బాధ్యతలను జగ్గయ్యపేట ఎంపీడీవో ఎం.రమేష్‌బాబు నియమితులయ్యారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రమేష్‌బాబు శనివారం బాధ్యతలు చేపట్టగా, ఆయనకు ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి శ్రీనివాస్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొలికపోగు వెంకటేశ్వర్లు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. మండలాభివృద్ధికి కృషిచేస్తానని రమేష్‌బాబు తెలిపారు.

మంచినీటి ట్యాంకుల పరిశీలన



ట్యాంకును శుభ్రం చేస్తున్న కార్మికులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ ప్రజలకు మంచినీటిని అందించే ట్యాంకుల శుభ్రత, నీటిని సజావుగా సరఫరా చేసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. వెంకటగిరి గుట్ట మీద ఉన్న నీళ్ల ట్యాంకుల నుంచి పరిసర ప్రాంత ప్రజలకు సక్రమంగా నీరు సరఫరా కావడంలేదని ఫిర్యాదులు అందడంతో అసిస్టెంట్ ఇంజనీరు హనుమంతరావుతో కలసి శనివారం ఆయన ఆ ట్యాంకులను పరిశీలించారు. పెద్దట్యాంకును శుభ్రం చేయించేందుకు చర్యలు చేపట్టారు. పైపులైన్‌కు మూడుచోట్ల లీకేజీలు ఉన్నట్లు గుర్తించి, వెంటనే మరమ్మతులు చేయాలని ఏఈని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఎమినిటీస్ కార్యదర్శులంతా వారి పరిధిలోని పైపులైన్లను పరిశీలించి లీకులు ఉంటే మున్సిపల్ ఏఈకి రిపోర్టు చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మంచినీటి సరఫరా చేసేందుకు ఎప్పటికప్పుడు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

బీమా మంజూరుపత్రం అందజేత



బాధిత కుటుంబానికి బీమా మంజూరుపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ: వైఎస్సార్ బీమా పథకం పేదలకు ఎంతో అండగా ఉంటోందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. కంచికచర్ల మండలం పరిటాల గ్రామానికి చెందిన ఉప్పులూరి పూర్ణచంద్రరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ.5లక్షలు ఆర్థికసాయంగా మంజూరైంది. ఈమేరకు రూ.5లక్షల మంజూరుపత్రాన్ని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు శనివారం తన కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందజేశారు.

స్వార్థ ప్రయోజనాల కోసమే టీడీపీ రాద్ధాంతం

కంచికచర్ల : పాతకక్షల నేపథ్యంలో కంచికచర్లకు చెందిన దళిత యువకుడు కె.శ్యామ్‌కుమార్‌పై కొంతమంది యువకులు దాడిచేసిన ఘటనను ఓ దళిత మాజీ ఎమ్మెల్యేతోపాటు టీడీపీ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం రాద్ధాంతం చేస్తున్నారని దళిత నాయకులు వేల్పుల రమేష్, వేల్పుల శ్రీనివాసరావు మండిపడ్డారు. శ్యామ్‌కుమార్‌పై దాడి బాధాకరమని, దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ తక్కువ సమయంలోనే నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. పాత కక్షల నేపథ్యంలో యువకుల మధ్య జరిగిన ఘర్షణను టీడీపీ నాయకులు రాష్ట్రప్రభుత్వానికి, ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్‌లకు ఆపాదించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఓ దళిత మహిళా సర్పంచిని పెత్తందారులు నానావిధాలుగా మానసికంగా హింసించి అవమానపర్చితే మాజీ ఎమ్మెల్యే సౌమ్య నోరు మెదపకపోగా, పెత్తందారులకే కొమ్ముకాసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో దళితులపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయించిన చరిత్ర కూడా మాజీఎమ్మెల్యేదేనని ఆరోపించారు. ప్రజల ఆదరణ కోల్పోయిన టీడీపీ, ఇలాంటి ఘటనలను అవకాశంగా మార్చుకుని ప్రచారం పొందాలని చూస్తోందని విమర్శించారు. ఇటువంటి చర్యలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో దళిత నాయకులు మాడుగుల ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, చటి రవీంద్ర పాల్గొన్నారు.

ఇద్దరు ఈవోల సస్పెన్షన్

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట శ్రీసీతారామ స్వామి దేవస్థానం(పెద్దరామాలయం) ఈవో పి.సీతారామయ్యతోపాటు గతంలో ఈవోగా పనిచేసిన కె.నాగరాజును సస్పెండ్ చేస్తూ దేవాదాయశాఖ కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కె.నాగరాజు గతంలో ఇక్కడ ఈవోగా పనిచేస్తూ బదిలీపై విజయవాడ వెళ్తున్న సమయంలో ఆర్డర్ ఉన్న పెద్దరామాలయం, అంబారుపేట, నందిగామలోని రామలింగేశ్వరస్వామి ఆలయాలతోపాటు ఆర్డర్‌లేని ఆలయాల బాధ్యతలను కూడా ప్రస్తుత ఈవో సీతారామయ్యకు అప్పగించారు. ఇలా ఆర్డర్‌లేని ఆలయాల బాధ్యతలు అప్పగించినందుకు నాగరాజును, బాధ్యతలు తీసుకున్నందుకు సీతారామయ్యను సస్పెండ్ చేసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా మార్పులు, చేర్పుల కోసం 308 అర్జీలు

జగ్గయ్యపేట అర్బన్: నియోజకవర్గంలో ఓటర్ల జాబితా మార్పులు, చేర్పుల కోసం శనివారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా ఓటర్ల నుంచి 308 అర్జీలు అందినట్లు జగ్గయ్యపేట తహశీల్దార్ సూర్యారావు తెలిపారు. జగ్గయ్యపేటలో 60 అర్జీలు, పేట మండలంలో 110, వత్సవాయి మండలంలో 85, పెనుగంచిప్రోలు మండలంలో 19, నందిగామ మండలంలోని ఏటిపట్టు గ్రామాల్లో 34అర్జీలు అందినట్లు ఆయన వివరించారు.

మోటార్లలోని కాపర్ వైర్ చోరీ



పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు అవతల మాగాణి పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద దొంగలు హల్‌చల్ చేసిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పొలాల్లోని మోటార్ల వద్ద ఫ్యూజులు తీసి, వైర్లు కత్తిరించి కాపర్ వైర్‌ను దొంగలు పట్టుకెళ్లారు. సుమారుగా 15 మోటార్ల వద్ద తీగను దొంగించారు. శనివారం ఉదయాన్నే పొలాలకు వెళ్లిన రైతులు ఈ విషయాన్ని గమనించారు. కాపర్ వైరు చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు.